
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఓటరు జాబితాలో మీ పేరుందా?

ఎన్నికల జాబితాలో ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. - 8లో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.2° / 26.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	39.0	24.0
కాకినాడ	35.1	26.5
అమలాపురం	39.2	26.0

న్యూస్‌రీల్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

కలెక్టర్ హిమాన్షుశుక్లా



ముమ్మిడివరంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో, అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడవ అంతస్తులో శుక్రవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోలింగ్ సిబ్బంది నియోజకవర్గాలకు కేటాయింపు ప్రక్రియను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రాండమైజేషన్ ద్వారా ఏడు నియోజకవర్గాలకు కేటాయిస్తూ వాటిపై స్టిక్కర్లు అతికించి ఆయా వివరాలను స్కానింగ్ చేసి అప్లోడ్ చేస్తామన్నారు. ప్రస్తుతం కేటాయించిన ఈవీఎంల జాబితా, పోలింగ్ సిబ్బంది జాబితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందిస్తామని చెప్పారు. అదే విధంగా సిబ్బంది కూడా రాండమైజేషన్ ప్రక్రియ వివరాల ప్రకా రం కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి. వైద్యనాథశర్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.మధుసూదన్, విద్యా సంక్షేమ ఇంజినీర్ విభాగం డీఈ సుబ్బరాజు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



చింతలూరు నూకాంబికా ఆలయంలో బారులు తీరిన భక్తులు

ఆలమూరు : చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతోంది. శుక్రవారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూ లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు పిల్లలు జెయింట్‌వీల్, కొలంబస్, రంగుల రాట్నాలను ఎక్కేందుకు ఆసక్తిని కనబర్చారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలార్జున



అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, తెలుగు భాషోపాధ్యాయుడు బాలార్జున సత్యనారాయణ మాకే శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నుంచి బాలార్జున నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సాహిత్యం ద్వారా తెలుగు భాషాభ్యున్నతికి ప్రపంచంలోనే అతిపెద్ద సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదికలో పని చేయడం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బాలార్జున పేర్కొన్నారు.

అనుభవం ముందంజ



రాజోలులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు హారతులు పడుతున్న మహిళలు



చప్పగా సాగుతున్న జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్

- రాజోలులో గొల్లపల్లి జోరు
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ తోడైన ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్
- జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు కొరవడుతున్న ఆదరణ
- నెలరోజుల క్రితం నియోజకవర్గానికి రాక
- జనంలోనే కాదు సొంత పార్టీలోనే పరిచయాలు తక్కువ
- సహకరించని బొంతు రాజేశ్వరరావు వర్గం

సాక్షి అమలాపురం: సార్వత్రిక ఎన్నికలలో విలక్షణమైన తీర్పులు ఇస్తూ రాష్ట్రంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న రాజోలులో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ది కూడా రాజోలు నియోజకవర్గం కావడంతో గొల్లపల్లికి కలిసి వచ్చింది. ఇదే నియోజకవర్గానికి చెందిన, కూటమి తరఫున జనసేన నుంచి పోటీచేస్తున్న దేవ వరప్రసాద్ ప్రచారం చప్పగా సాగుతోంది.

వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీలో ఇటీవల చేరినప్పటికీ ఆయన పదేళ్లుగా ఈ నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. టీడీపీ తరఫున 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన 2019లో ఓటమి చెందినప్పటికీ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయన హయాంలో చేసిన అభివృద్ధికి తోడు గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు గొల్లపల్లికి కలిసి వస్తున్నాయి. ప్రజలతో మమేకం అయ్యే స్వభావం... ప్రతి ఒక్కరినీ వరసలు పెట్టి పలకరించే గొల్లపల్లి ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంటోంది. వెళ్లిన ప్రతిచోటా మహిళలు గొల్లపల్లికి హారతులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ సృష్టిస్తున్న ప్రచార సునామీకి తోడు గొల్లపల్లి ఉత్సాహవంతమైన ప్రచారం పార్టీకి కలిసి వస్తోంది. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారుల కోసం ఫిషింగ్ యార్డు నిర్మాణంలో భాగస్వామ్యం కావడం కూడా కలసివస్తోంది. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాపాక వరప్రసాదరావు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇద్దరూ కలిసి తరచూ ఎన్నికల ప్రచారం చేయడం కూడా పార్టీకి బలం చేకూర్చింది. గొల్లపల్లి తనయుడు శ్రీధర్ కూడా నియోజకవర్గంలో యువతను ఆకర్షిస్తూ ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు.

40 ఇయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ

రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు రాజకీయాలలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. కొత్తపేట సమితి అధ్యక్షుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం రాష్ట్రమంత్రిగా పనిచేసే స్థాయి వరకు సాగింది. అల్లవరం, రాజోలు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ఘనత గొల్లపల్లి సొంతం. అల్లవరం అసెంబ్లీ నుంచి 1985, 2004లో ఆయన విజేతగా నిలిచారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా సహకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, చిన్న తరహా పరిశ్రమల శాఖమంత్రిగా పనిచేశారు. 1989లో ఓటమి చవిచూసిన ఆయన 2014లో రాజోలు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికలలో ఓటమి చెందారు. ముమ్మిడివరం నుంచి సైతం ఎమ్మెల్యేగా లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత జి.ఎం.సి.బాలయోగిపై పోటీ చేశారు. కొత్తపేట నుంచి సమితి అధ్యక్షుడిగానే కాకుండా ఇక్కడ నుంచి జెడ్పీటీసీగా ఎన్నికై జెడ్పీ ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశారు. ఇలా కోనసీమ నలుమూలలా వివిధ ఎన్నికలలో పోటీ చేసిన అనుభవంతోపాటు విస్తృత పరిచయాలు గొల్లపల్లికి ఉన్నాయి.

వెనకబడ్డ జనసేన అభ్యర్థి

నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థి దేవ వరప్రసాద్ ప్రచారంలో వెనుకబడ్డారు. ఇక్కడ అభ్యర్థి ఎంపికలో తీవ్ర జాప్యం కావడం, నియోజకవర్గంలో ఆశావహులను సంతృప్తి పరచడంలో విఫలం కావడం వంటివి జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు మైనస్‌గా మారాయి. దీనితో ఆయన ప్రచారం వెలవెలబోతోంది. నలుగురు ఆశావహులు టికెట్ కోసం గ్రూపులుగా ఏర్పడి ప్రచారం చేసుకోవడం వల్ల ప్రస్తుతం వారి మధ్య సమన్వయం లేకుండా పోయింది. ఆ వర్గపోరే అభ్యర్థికి తలనొప్పిగా మారింది. జనసేనలో ఎవరికి వారే నాయకులుగా చలామణి కావడం వల్ల వారిని సమన్వయం చేయడంలో విఫలమయిన అభ్యర్థి దేవ వరప్రసాద్ వారిపై విరుచుకుపడుతున్నారు. అభ్యర్థి పార్టీలో చేరి రెండేళ్లు అయినా నియోజకవర్గంలో ఎప్పుడూ పర్యటించలేదు. కేవలం పార్టీ టికెట్ ఇచ్చిన తరువాతే నియోజకవర్గంలో అడుగు పెట్టారు. అప్పటికే పార్టీలో చేరిన ఏడాదికే నియోజకవర్గంలో పార్టీ టికెట్ తనదే అంటూ ఒక వర్గాన్ని తయారు చేసుకున్న బొంతు రాజేశ్వరరావు వర్గం ప్రచారానికి దూరంగా ఉంటోంది. గ్రామాలలో ప్రచారానికి వెళ్తున్నప్పటికీ ఎవరేమిటో తెలియకపోవడం, కనీసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతల పేర్లు కూడా తెలియకపోవడం అభ్యర్థికి మైనస్ అవుతోంది. గత ఎన్నికల్లో జనసేన గెలిచిన ఏకైక స్థానం ఇది. కాని ఇక్కడ అభ్యర్థి ప్రసాద్ ప్రచారం చూసి ఈసారి గెలుపు కష్టమని క్యాడర్ వాపోతోంది.

అమ్మాయిలే మిన్నగ..

- ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి
- ఫస్టియర్ 60 శాతం, సెకండియర్ 72 శాతం ఉత్తీర్ణత
- ఈ నెల 24 వరకు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు తుది గడువు
- మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు



రాయవరం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో బాలికల హవా కనిపించింది. గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా బాలికలు మంచి ఉత్తీర్ణతను కనబరిచారు. ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితా లు శుక్రవారం బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్ విడుదల చేశారు. మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్, జనరల్, ఒకేషనల్ ఫలితాలు ఒకేసారి విడుదల చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఫస్టియర్ ఫలితాల్లో 60శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 72 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 17వ స్థానం, సెకండియర్ ఫలితాల్లో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఇంటర్మీడియెట్ జనరల్ ప్రథమ సంవత్సరం 4,584 బాలురకు 2,300 మంది ఉత్తీర్ణత సాధించగా ఉత్తీర్ణతా శాతం 50గా ఉంది. బాలికలలో 6,161మందికి 4,144 మంది ఉత్తీర్ణులవ్వగా, ఉత్తీర్ణతా శాతం 67గా ఉంది. మొత్తం బాలురు బాలికలు కలిపి 10,745కు గాను 6,444 మంది ఉత్తీర్ణులు కాగా, ఉత్తీర్ణతా శాతం 60 సాధించారు. ద్వితీయ సంవత్సరం 3,522 బాలురకు గాను 2,276 మంది (65 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలలో 5,322 మందికి 4,062 మంది(76 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా బాలురు, బాలికలు కలిపి 8,844 మందికి 6,338 (72 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్ కోర్సుల్లోనూ...: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ విద్యలోనూ బాలికలే మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ప్రథమ సంవత్సరం బాలుర,బాలికల ఉత్తీర్ణత శాతం వివరాలు పరిశీలిస్తే ....1,098 బాలురకు 467 మంది(43 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 1,319 మందికి 887 మంది(67 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం బాలురు, బాలికలు కలిపి 2,417కు గాను 1,354 మంది(56శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ ఫలితాలను చూస్తే 816 బాలురకు గాను 439 మంది(54శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 963 మందికి 718 మంది(75 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం బాలురు, బాలికలు కలిపి 1,779 మందికి 1,157 మంది(65శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఈ నెల 24 వరకు ఇంప్రూమ్‌మెంట్‌కు అవకాశం

ఏ కారణం చేతనైనా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు అమలాపురంలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావచ్చునని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఫస్టియర్, సెకండియర్‌లో పరీక్ష తప్పిన విద్యార్థులు, ఫస్టియర్ ఇంప్రూమ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్ష రుసుం చెల్లించడానికి అవకాశాన్ని ఇంటర్మీడియెట్ బోర్డు కల్పించింది.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

రీ కౌంటింగ్‌కు ఈ నెల 24 తుది గడువు

ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు వారు సాధించిన మార్కులపై ఏదైనా సందేహం ఉంటే రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఏప్రిల్ 18 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

నిరాశ పడవద్దు



ఇంటర్ తప్పిన, మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకుండా తిరిగి ప్రయత్నించాలి. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు తోడుగా నిలవాలి. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నిర్దేశిత సమయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. – వనుము సోమశేఖరరావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, అమలాపురం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక కార్యాలయం ప్రారంభం



రాపాకను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ

అమలాపురం రూరల్: అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌కు క్యాంప్ కార్యాలయాన్ని భట్నవెల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర రవాణశాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోనసీమలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అందరి గెలుపు ఖాయమని అన్నారు. తొలుత రాపాక ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడ సతీష్ కుమార్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు రాపాక వరప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని నక్షత్ర మాల దీక్ష

- అంతర్వేదిలో ఈ నెల 23, 24 తేదీలలో మాల ధారణ
- వచ్చే నెల 22న దీక్ష విరమణ



ఆలయంలో నిర్వహించే విశేష పూజలకు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో 27 రోజుల స్వామివారి నక్షత మాల దీక్షా ధారణ ఈ నెల 23, 24 తేదీలలో ఆలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆలయంలో ఈ మేరకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తుల దీక్షా విరమణ వచ్చే నెల 22న నృసింహ జయంతి రోజున ఏర్పాటు చేశామన్నారు. కాగా స్వామివారి నక్షత్ర మాలధారణ ధరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ ఆలయ ఉత్తర రాజగోపురం పైన గల కలశముల పునఃప్రతిష్ఠకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకుగాను 13న అర్చకులు, పండితులతో సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, 14న కలశాలకు అభిషేకం, విశేష పూజలు, 15న ఉదయం గం.8–25 గంటలకు కలశాలల పునఃప్రతిష్ఠ సుముహూర్తం, పూర్ణాహుతి చేస్తామన్నారు. 17న శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారి సన్నిధిలో కోదండరామస్వామి జయంతి వేడుకలు, 19 నుంచి 24 వరకూ కోదండరామ స్వామి పాంచాహ్నిక కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ వివరించారు. 23, 24 తేదీలలో భక్తులకు స్వామివారి నక్షత్ర మాలదీక్షా ధారణ జరుగుతుందని, వచ్చే నెల 22న నక్షత్ర మాల దీక్షా విరమణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

18న సీఎం జగన్ ఎన్నికల శంఖారావం

వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



రావులపాలెంలో మేమంతా సిద్ధం పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు మిథున్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, మంత్రి విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ, ఎంపీ అభ్యర్థి రాపాక , ఎమ్మెల్యే అభ్యర్థులు చిర్ల జగ్గిరెడ్డి, విప్పర్తి వేణుగోపాలరావు

సాక్షి అమలాపురం/ రావులపాలెం: సంక్షేమ రథ సారధి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభ ద్వారా జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. జిల్లా ముఖ ద్వారం రావులపాలెంలో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు పి.మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వెల్లడించారు. రావులపాలెం సీఆర్‌సీలో శుక్రవారం మిథున్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ పర్యటన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న భీమవరంలో సిద్ధం సభ ముగించుకుని సీఎం జగన్ రాజమహేంద్రవరం రూరల్ చేరుకుంటారని, 16న రోడ్డు షో నిర్వహించి అక్కడే బస చేస్తారన్నారు. ఈ నెల 17న శ్రీరామనవమి రోజున ప్రచారానికి సెలవు ప్రకటించారని, తిరిగి 18న రావులపాలెంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే మేమంతా సిద్ధం సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారని, సుమారు రెండు లక్షల మంది ఈ సభకు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభను విజయవంతం చేయాలని కోరారు. సభ అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ వెళతారన్నారు. మేమంతా సిద్ధం సభలో జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తారని మిథున్‌రెడ్డి, విశ్వరూప్ తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికలు వైఎస్సార్ సీపీకి, స్వలాభం కోసం జత కట్టిన మూడు పార్టీలకు మధ్య జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యుడు బోస్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీను అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. దేశంలో 71 ఏళ్ల ఎన్నికల చరిత్రలో మేనిఫెస్టోను వందశాతం అమలు చేసింది జగన్ ఒక్కరే అన్నారు. ఇది పార్టీకి కలిసివచ్చే అతి పెద్ద అంశమన్నారు. ప్రజలు దీనిని గుర్తించారని, ఎంతమంది జత కట్టినా వైఎస్సార్ సీపీపై గెలవడం సాధ్యం కాదని బోస్ వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు చిర్ల జగ్గిరెడ్డి, తోట త్రిమూర్తులు, విప్పర్తి వేణుగోపాలరావు, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అంతకుముందు మిథున్‌రెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులు, ఎన్నికల ప్రచారం జరుగుతున్న తీరుతెన్నులు అడిగి తెలుసుకున్నారు.

రెక్కలు కట్టుకుని వచ్చేస్తారు

- జిల్లాలో 440 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు
- రాజమహేంద్రవరం సిటీలో 175 మంది
- ఎన్నికల వేళకు వచ్చేందుకు సన్నాహాలు



రాజమహేంద్రవరం రూరల్: గోదావరి జిల్లాల్లో ఫలితం ఎటు? అనపర్తిలో నిలిచేదెవరు? రాజానగరంలో సత్తా చాటెదెవరు? రాజమహేంద్రవరం రూరల్‌లో గెలుపు ఎవరిది? రాజమహేంద్రవరం సిటీలో చిందేసేది ఎవరు? నిడదవోలులో పెత్తనం ఎవరిది? కొవ్వూరు నుంచి అసెంబ్లీలో వాణి వినిపించేదెవరు? గోపాలపురంలో మళ్లీ ఎలా ఉండబోతోంది?.. సార్వత్రిక ఎన్నికల వేళ ఓటర్లలో ఇటువంటి ఆసక్తి ఉండటం సర్వసాధారణం. ఈ ఎన్నికలపై స్థానికులే కాదు.. ఇక్కడి నుంచి ఉద్యోగాలు, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారు సైతం ఎక్కడలేని ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడి సంగతులను ఆన్‌లైన్, వాట్సాప్ కాల్‌లో మాట్లాడి తెలుసుకోవడానికి ఉత్సుకత చూపుతున్నారు. వీరిలో చాలా మంది ఎన్నికల సమయానికి స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొంతమంది ఆయా పార్టీలపై అభిమానంతో వచ్చి, ప్రచార వ్యూహాలకూ తమ వంతు సహకారం అందిస్తున్నారు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 440 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒకరు థర్డ్‌జెండర్ కూడా ఉన్నారు. ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన జాబితాలోని లెక్కలివి. అత్యధికంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 175 మంది, అత్యల్పంగా రాజానగరంలో 11 మంది చొప్పున ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు.

విదేశాల్లో ఉన్నా ఓటు వినియోగం

విదేశాల్లో ఉంటున్నా భారతీయులు ఓటు వేయడానికి అర్హులే. అక్కడి పౌరసత్వం లేని భారతీయ పౌరులు 18 ఏళ్లు నిండితే చాలు పాస్‌పోర్ట్‌లోని భారతదేశం చిరునామా వివరాలతో.. నమోదు చేసుకున్న ప్రాంతంలో నేరుగా ఓటు వేయవచ్చు. దీని కోసం ఫారం–6 దరఖాస్తు చేసుకోవాలి. ఈఆర్‌ఓకు నేరుగా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఈఆర్ఓ చిరునామాకు పోస్టులోనూ పంపవచ్చు. పోస్టు ద్వారా పంపేవారు పాస్‌పోర్టు లోపలి పేజీ ఫొటో, వ్యక్తిగత వివరాలు ఉన్న పేజీని ఫొటో తీసి, చెల్లుబాటు అయ్యే వీసా వివరాలు జత చేసి పంపాలి. ఈ పత్రాలన్నింటినీ మన దేశ అధీకృత అధికారి ధ్రువీకరించాలి. ఈఆర్‌ఓకు వ్యక్తిగతంగా దరఖాస్తు ఇవ్వాలనుకుంటే ఒరిజినల్ పాస్‌పోర్ట్ సమర్పిస్తే పరిశీలన పూర్తయ్యాక ఇచ్చేస్తారు. పోలింగ్ రోజున అదే పాస్‌పోర్ట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఎన్ఆర్ఐ ఓటర్లు

నియోజకవర్గం	ఎన్ఆర్ఐ ఓటర్లు
అనపర్తి	17
రాజానగరం	11
రాజమహేంద్రవరం రూరల్	22
రాజమహేంద్రవరం సిటీ	175
నిడదవోలు	93
కొవ్వూరు	73
గోపాలపురం	49

రాములోరి పెళ్లికి పందిరి రాట

- 16న వధూవరులుగా సీతారాముల అలంకరణ
- 17న సీతారామ కల్యాణం
- 24న శ్రీపుష్పయాగంతో వేడుకల ముగింపు



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న పండితులు, అధికారులు

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్రస్వామి వారి శ్రీరామ నవమి వేడుకలకు పండితులు శుక్రవారం పందిరి రాట వేశారు. రత్నగిరిపై రామాలయం వద్ద ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. పండితులు తొలుత పందిరి రాటకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణతో రాట ముహూర్తం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారావు, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, రామాలయ అర్చకులు దేవులపల్లి ప్రసాద్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు రత్నగిరిపై శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. రత్నగిరి క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలను సాక్షాత్తూ సత్యదేవుడు, అమ్మవారు పెళ్లిపెద్దలుగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తిని వధూవరులుగా అలంకరించడంతో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయి. 17వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. 18, 19, 20, 21 తేదీల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, 22న వనవిహారోత్సవం, 23న శ్రీచక్రస్నానం, దండియాడింపు ఉత్సవాలు నిర్వహిస్తారు. 24వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగంతో శ్రీరామ నవమి వేడుకలు ముగుస్తాయి.

క్లుప్తంగా

చురుగ్గా సత్యదేవుని నమూనా ఆలయ పనులు

22న ప్రారంభం



నమూనా ఆలయం గుమ్మం ముహూర్తంలో పాల్గొన్న పండితులు, అధికారులు

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై సుమారు రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీన స్వామివారి నమూనా ఆలయంలో సత్యేదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే అధికారులు నిర్ణయించారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి.

ఘనంగా గర్భాలయ గుమ్మం ముహూర్తం

దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం నమూనాలయ గర్భాలయ గుమ్మం ముహూర్తం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు పండితుల మంత్రోచ్చాటన మధ్య సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు ప్రధాన ద్వారం గుమ్మానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఈ నరసింహారెడ్డి, ఏఈఈ కృష్ణారావు, డీఈ గుర్రాజు, ఆలయ నిర్మాణ కాంట్రాక్టర్ డీవీ సుబ్బరాజు పూజలు చేశారు. వచ్చే పది రోజుల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఓటరు జాబితాలో మీ పేరుందా?

- ఓటు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తుకు అవకాశం
- ఓటును ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేయొచ్చు



ప్రత్తిపాడు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో అసలు ఓటరు జాబితాలో తన పేరు ఉందో? లేదో? అనే సందేహం కొందరిలో ఉంటుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్ జాబితాలో ఓటు వివరాలు ముందే తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్ హెల్ప్ లైన్

ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి, ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓటర్ హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

స్మార్ట్ ఫోన్లలో ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే సెర్చ్‌బై కింద వచ్చిన ఆప్షన్లలో ఎపిక్ నంబర్ ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. హెచ్‌టీటీపీ://సీఈసీఏపీఈఆర్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఎన్ లింకును తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ చేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

- కంప్యూటర్ ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకునే హెచ్‌టీటీపీ://ఎలక్టోరల్‌సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్‌బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, ఓటర్ ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్రప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.
- ఓటు వివరాలు తెలుసుకునేందుకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్
- అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

లేకపోతే నమోదు చేసుకోవాలి

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎస్ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఇద్దరి నుంచి రూ.12 లక్షల స్వాధీనం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



సామర్లకోట మఠం సెంటర్‌లో తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రూ.12,32,511 స్వాధీనం చేసుకున్నారు. మఠం సెంటర్‌లో మోటారు సైకిళ్లపై వేరు వేరుగా వెళుతున్న ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జె.రామారావు ఆధ్వర్యంలో అనుమానంతో తనిఖీ చేశారు. అచ్చంపేట గ్రామానికి చెందిన యళ్ల రమేష్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.7,28,611 నగదు కలిగి ఉండటంతో ఆయన వద్ద నుంచి సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పీబీ దేవం గ్రామానికి చెందిన సందవోలు వీరవెంకట సత్యనారాయణమూర్తి నుంచి రూ.5,03,900 స్వాధీనం చేసుకున్నారు. యూనియన్ బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసి తీసుకొని వస్తున్న సమయంలో నగదును స్వాధీనం చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నా పోలీసులు పట్టించుకోలేదని సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలతో కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి సొమ్ము తెచ్చుకోవాలని చెప్పడం వింతగా ఉందని అన్నారు. 80 సంవత్సరాల వయసులో ఎండలో ఎక్కడ తిరుగుతానని, ఆధారాలను పరిశీలించి సొమ్ము ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐ తీరును ఆయన తప్పు పట్టారు. ఎటువంటి ఆధారాలు లేకుండా స్వాధీనం చేసుకున్న నగదును పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు తెలిపారు.

సత్యదేవుని ఉత్సవాలకు పంపాలో నీటి నిల్వలకు చర్యలు

కలెక్టర్‌కు దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ లేఖ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 16 వ తేదీ నుంచి జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు, మే 18 వ తేదీ నుంచి జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు పంపా నదిలో తగినన్ని నీటి వనరులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. పంపానదిలో నీరు అడుగంటిన వైనంపై ×సాక్షి× దినపత్రికలో ఈ నెల పదో తేదీన ×ఎండిపోయినది× శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఈఓ పంపా నదిలో తగినంత నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరనున్నట్టు తెలిపారు. దాని ప్రకారం ఆయన శుక్రవారం రాసిన లేఖలో ఈ వేసవిలో సత్యదేవుని ఆలయానికి ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేస్తారని తెలిపారు. దేవస్థానంలో నీటి సరఫరాకు పంపా నదిలో గల బోర్ల ద్వారా పంపింగ్ చేసే నీరే ఆధారమని తెలిపారు. ప్రస్తుతం పంపా నదిలో నీరు లేనందున భక్తులకు, దేవస్థానానికి ఇబ్బంది తప్పదని తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న పంపా నదిలో శ్రీచక్రస్నానం, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో భాగంగా మే నెల 23వ తేదీన సత్యదేవుని శ్రీచక్రస్నానం కార్యక్రమాలకు పంపా స్నానఘట్టం వద్ద కనీసం నాలుగు అడుగుల మేర నీటి మట్టం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల ఏలేరు రిజర్వాయర్ నుంచి రోజు 200 క్యూసెక్కుల నీరు పంపాకు తరలించేలా ఆదేశాలివ్వాలని ఈఓ కోరారు.

లారీని ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మధు మృతదేహం

పెరవలి: నిడదవోలు–నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో కానూరు వద్ద గురువారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండల కలవచర్లలో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై తన బంధువుల అబ్బాయి ముప్పిడి నాగ చరణ్‌తో కలసి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడటంతో పాటు వేగంగా వస్తుండగా సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న మోటార్ సైకిలిస్ట్ లారీ వెనుక ఢీకొట్టాడు. అతని తలకు బలమైన గాయం అవ్వటంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. చరణ్ తీవ్ర గాయాల పాలవ్వటంతో హుటాహుటిన 108లో తణుకులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మధు తల్లితండ్రులు పరాయి దేశంలో ఉపాధి కోసం వెళ్లారని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం లారీ డ్రైవరేనని అతని నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృత దేహానికి శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు. మృతిని బందువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

రంగంపేట భవిత కేంద్రానికి రాష్ట్రంలో ప్రథమ స్థానం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాధిక

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తీర్చిదిద్దటంలో రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎల్ఎం కిట్లు, ట్యాబుల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ముద్రగడ ప్రసాద్, జి.అంజిల కృషిని ఆమె అభినందించారు. అనంతరం రికార్డులు, విద్యాబోధన తీరును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు, మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి ఎల్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ప్రతిభ



బైపీసీ విభాగంలో 971 మార్కులు సాధించిన బుంగా ఈప జాస్మిన్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని బుంగా ఈప జాస్మిన్ 971 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులలో జాస్మిన్ ఒకరు. గురుకుల కళాశాలలో జాస్మిన్ ప్రథమస్థానం సాధించగా, ఎంపీసీ విభాగంలో ఐ.స్ఫూర్తి 944 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్.లక్ష్మీ 943మార్కులతో తృతీయస్థానం సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగంలో 75మంది పరీక్షకు హాజరుకాగా 74మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో తొమ్మిది మంది 900 మార్కులు పైన సాధించారని ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన చిన్నం వీరబాబు, ఆయన భార్య సత్యదుర్గ మోటారు సైకిల్‌పై కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వెళ్లి తిరిగి వస్తుండగా మహిపాల చెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న భగవద్గీత అష్టావధానం



మీడియాతో మాట్లాడుతున్న పీఠం ఈసీ మెంబర్ సత్యనారాయణ, సభ్యులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యాన స్థానిక గౌతమ ఘాట్‌లోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఏప్రిల్ 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తామని రాజమహేంద్రవరం శాఖ ఈసీ మెంబర్ వనపర్తి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పీఠం నవమ పీఠాధిపతులు సద్గురు డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి దివ్య ఆశీస్సులతో భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి, అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఈ అష్టావధానం చేస్తారని తెలిపారు. వేదావధానం నుంచి కవితావధానం వచ్చిందని, ఎంతోమంది అవధానులు అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలు చేశారని, ఇంకా చేస్తున్నారని ఆయన వివరించారు. అయితే భగద్గీతను అవధానంగా మలిచి ఉమామహేశ్వరరావు ఇప్పటివరకు 19వ అవధానాలు చేశారని, 20వ అష్టావధానం రాజమహేంద్రవరంలో చేస్తున్నారని ఆయన చెప్పారు. అవధాన ప్రాచార్య, పద్య కళాతపస్వి, ధూళిపాళ మహాదేవమణి సభా సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు. పీఠం శాఖ కార్యదర్శి డి.కృష్ణంరాజు మాట్లాడుతూ కవులకు, గౌతమఘాట్ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరిస్తామని తెలిపారు. పీవీఎస్ కష్ణారావు మాట్లాడుతూ ఈ సాహితీ కార్యక్రమానికి సాహితీ ప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

గోడి గురుకులం విద్యార్థికి ఇంటర్‌లో 966 మార్కులు



ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బైపీసీలో 966 మార్కులు సాధించిన నాగశ్రీ అశ్విని

అల్లవరం: విద్యా శాఖ విడుదల చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అల్లవరం మండలం గోడి బాలికల గురుకులం విద్యార్థి ఉప్పలగుప్తం మండలం కామరావుపేట ప్రాంతానికి చెందిన పెయ్యల నాగశ్రీ అశ్విని బైపీసీ గ్రూపులో 966 మార్కులు సాధించి గురుకులాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో మంచి స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ కిరణ్మయి శుక్రవారం తెలిపారు. గురుకులం నుంచి 71 మంది పరీక్షలు రాయగా 73 శాతంతో 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 53 మందికి 49 మంది ఉత్తీర్ణత సాధించారని కిరణ్మయి తెలిపారు. జిల్లా స్థాయిలో గురుకులం విద్యార్థికి ఈ స్థాయిలో మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు. గోడిలోని బాలుర గురుకులంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు 29 మంది పరీక్షలు రాయగా 79.3 శాతంతో 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 36 మందికి 29 మంది విద్యార్థులు పాసయ్యారని తెలిపారు.

పెద్దిపాలెంలో భారీ అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల ఆస్తినష్టం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన అచ్చిరాజు, పక్కుర్తి లోవరాజు, పక్కుర్తి మాణిక్యంలకు చెందిన తాటాకింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందాయి. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో 20 కాటాల ధాన్యం, బైక్, నాలుగు తులాల బంగారం, లక్ష రూపాయల నగదుతో సహా గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రత్తిపాడు అగ్రిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో మూడు కుటుంబాల వారు నష్టపోయారు.

లాడ్జిలో యువకుడి మృతి



లాడ్జిలో మృతిచెందిన అనిల్‌కుమార్

రామచంద్రపురం: పట్టణంలోని ఒక లాడ్జిలో యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. రామచంద్రపురం ఎస్సై కె. సురేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన పెమ్మనబోయిన అనిల్ కుమార్(25) క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. లాడ్జిలో రూం తీసుకున్న అనిల్‌కుమార్ బెట్టింగ్‌ల మూలంగా అప్పుల ఒత్తిడి గురయ్యినట్టు తెలుస్తోందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు లాడ్జిలో తాను తీసుకున్న రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

- 87 మద్యం సీసాలు, 16.17 లీటర్ల ఐఎంఎల్ పట్టివేత
- ఏడుగురి అరెస్ట్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోంది. జిల్లా పోలీసు శాఖ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎస్ఈబీ బృందాలు ఎక్కడికక్కడ నిఘా వేసి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో జిల్లాలో ఈ బృందాలు దాడుల, తనిఖీలు చేసి మొత్తం 87 మద్యం సీసాలు, 16.17 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు, తనిఖీల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- ఉప్పలగుప్తం, ఐ.పోలవరం పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన రెండు అక్రమ మద్యం కేసుల్లో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 20 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 3.09 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధుల్లో నమోదైన 7 అక్రమ మద్యం కేసుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 నాన్ డ్యూటీ పెయిడ్
- మద్యం సీసాలు, 60 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 13.08 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేట చెక్ పోస్టుల్లో అక్రమ రవాణాపై వాహనాలను నిలిపి విస్తృత తనిఖీ చేశారు.
- సమస్యాత్మక గ్రామాలైన అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, ద్రాక్షారామ మండలం జగన్నాయకులపాలెం, వేలంపాలెం గ్రామాల్లో ఆయా మండలాల పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే అంశాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

చెస్ టోర్నీ విజేత సాయి సంతోష్



ఓపెన్ చెస్ టోర్నీ విజేతలతో ముఖ్యఅతిథి చంద్ర తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీడిగలోని ఎస్ఎస్ఏవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా సాయి సంతోష్ నిలిచాడు. రన్నర్‌గా రాజ్‌గోపాల్ గెలుపొందాడు. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపార వేత్త వైఎస్ చంద్ర మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, నిరంతర శిక్షణ అవసరం అన్నారు. చెస్ క్రీడ మేధస్సుకు సంబంధించినదని, దీనిని ఆడడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. విజేతలకు రూ.6వేలు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకుడు దివ్యతేజ, నల్లప్రసాద్, నాగం శ్రీనివాసరావు, చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, కోశాధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.